క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐవీఆర్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని.. జర్నలిస్ట్ కాలనీ, బ్రహ్మణిసదన్, ఎల్లా హోటల్, హిల్‌రిడ్జ్ విల్లాస్, గోపీచంద్ అకాడమీ, ఎమ్మార్ ప్రాపర్టీస్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.. జయభేరీ పైన్‌వ్యాలీ, కేర్ హాస్పిటల్, ఐడీబీఐ బ్యాంక్, బ్రహ్మ కుమారీస్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్‌ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కొండాపూర్ పరిధిలో..

శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. జయదర్శినీ అపార్ట్‌మెంట్స్, అంజయ్య కమ్యూనిటీ హాల్ పరిసరాలు, అర్బన్ అపార్ట్‌మెంట్స్..

- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.. సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ,అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని గచ్చిబౌలి ఏఈ రాజశేఖర్ రెడ్డి కోరారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'ఎంజాయింగ్ ది లైఫ్ ఆఫ్ ప్రోగ్రెస్' అనే అంశంపై బ్రహ్మకుమారీస్ సంస్థ సీనియర్ రిసోర్స్‌పర్సన్, హైదరాబాద్‌కు చెందిన బ్రదర్ బి.కె. వంశీధర్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చని నిర్వాహకులు కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 50 , బెండ 35, కాకర 35, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 35, వంకాయ 30, గోకర 40, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 160, వెల్లుల్లి 160.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 14 మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 09 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం బీ.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన కేటీఆర్‌ను కలిసి తనకు టికెట్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి గెలిచి, హ్యాట్రిక్ సాధించి సీఎం కేసీఆర్‌కు కానుక ఇస్తానని గాంధీ అన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్ ,సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు కోటే శంకర్, భారతి నగర్ 111 డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్ , రామచంద్రాపురం 112 డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్ ,నాయకులు పాల్గొన్నారు.

డ్రీమ్ హ్యాక్ ఫెస్ట్ నవంబరులో...

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే పేరొందిన డిజిటల్ ఫెస్ట్...డ్రీమ్ హ్యాక్ నగరంలో జరుగనుంది. తమ 4వ ఎడిషన్‌ను నగరంలో నిర్వహించనున్నట్టు నిర్వాహక సంస్థ నోడ్విన్ గేమింగ్, ఇఎస్ఎల్ ఫేసెల్ట్ గ్రూప్ ప్రతినిధులు తెలిపారు. వచ్చే నవంబరు 3న మాదాపూర్‌లోని నొవోటెల్ హోటల్ వేదికగా ఈ ఫెస్ట్ ప్రారంభం అవుతుందని, 3 రోజుల పాటు ఆసక్తికరమైన గేమింగ్–పాప్ కల్చర్, అత్యాధునిక టెక్నాలజీ విశేషాలు...ఇవన్నీ ఈ ఈవెంట్‌లో చోటు చేసుకోనున్నాయన్నారు.

అండర్‌బ్రిడ్జి వరద సమస్యకు చెక్



ఇటీవల కురిసిన వర్షాలకు లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద భారీగా చేరిన వరదనీరు (ఫైల్)



అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ (ఫైల్)

- త్వరలో వరదనీటి కాలువ, బాక్స్ కల్వర్ట్ నాలా నిర్మాణం
- రూ.4 కోట్ల పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి: అండర్‌బ్రిడ్జి వరద నీటి సమస్యకు చెక్ పడనుంది. వర్షాకాలం చిన్నపాటి వర్షం కురిసినా లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద వరదనీరు భారీగా వచ్చి చేరడం.. వాహనాల నిలిపివేత ఏటా జరిగే తంతు. ఈ నేపథ్యంలో బాక్స్ కల్వర్టు, వరదనీటి కాలువ నిర్మాణంతో సమస్యకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. దీంతో లింగంపల్లి అండర్‌బ్రిడ్జి సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆమోదముద్ర పడింది. శంకుస్థాపన సైతం చేశారు. కాగా వరద నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఆర్‌ఓబీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌ఓబీ నిర్మించాలంటున్న ప్రజలు

- లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వరద నీటి సమస్యకు పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు ఆరంభించారు.
- రూ.4 కోట్లతో చేపట్టే బాక్స్‌టైప్ కల్వర్ట్ నాలా, వరదనీటి కాలువ పనులకు ఆగస్టు 28వ తేదీన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారుల సమక్షంలో శంకుస్థాపన చేశారు.
- అయితే లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి నాలుగు వైపులా లోతట్టు ప్రాంతం కావడంతో అన్ని వైపుల నుంచి వరదనీరు ఇక్కడకు వచ్చి చేరుతోంది.
- దీంతో ప్రతియేటా జూన్– అక్టోబర్ వరకు వర్షాలు పడిన ప్రతిసారీ ఈ సమస్య తలెత్తడం పరిపాటిగా మారింది.
- ప్రధానంగా లింగంపల్లి బోర్డుతో ఉన్న కమాన్ మొదలు కొని శాంటామరియా ఇంటర్నేషనల్ స్కూల్ వరకు రోడ్డును కలుపుతూ ఆర్‌ఓబీ నిర్మించాలని పలువురు సూచిస్తున్నారు.
- పాపిరెడ్డికాలనీ, లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్ళేందుకు మార్గం మూసివేయకుండా అండర్ బ్రిడ్జీని అలానే కొనసాగిస్తే మేలు అని కూడా సూచిస్తున్నారు.

ఆర్‌ఓబీ చాలా అవసరం



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద సమస్య శాశ్వత పరిష్కారం కావాలంటే ఆర్‌ఓబీ నిర్మాణం అత్యంత అవసరం. అధికారులు ఆదిశగా దృష్టి పెట్టాలి. ఎన్నో ఏళ్ళుగా ఈ సమస్య. వరదనీటి కాలువ, బాక్స్‌టైప్ కల్వర్టు నిర్మాణం తాత్కాలికమే. ఈ మార్గంలో గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాంగూడ, తదితర ప్రాంతాల్లోని సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడుతున్నారు.

–మహేష్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఆర్‌ఓబీయే శాశ్వత పరిష్కారం..



ప్రస్తుతం జీహెచ్ఎంసీ అధికారులు వరదనీటి కాలువ, బాక్స్‌టైప్ కల్వర్టు నిర్మాణం చేయాలనుకోవడం బాగుంది. కానీ దీనికి చక్కటి పరిష్కారం ఆర్‌ఓబీ నిర్మాణం. దీన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టడంతోపాటు అండర్‌బ్రిడ్జిని కూడా కొనసాగించాలి. స్థానికంగా స్కూల్, పాపిరెడ్డి కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగేందుకు కూడా అవసరం.ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– తాడిబోయిన రామస్వామియాదవ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గాంధీ

బీఆర్ఎస్‌లో చేరికలు

మియాపూర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని సాయినగర్, యూత్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు 100 మంది హఫీజ్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు జగదీశ్వర్, ఉప్పలపాటి శ్రీకాంత్‌ల సమక్షంలో మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ యువత అంతా బీఆర్ఎస్ వైపే ఉందని అందరికి మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు , మాజీ కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

'నిథమ్'లో పర్యాటక దినోత్సవ సంబరాలు-2023

నాలుగు రకాల పోటీలు..
ఈనెల 15వ తేదీ వరకు అవకాశం

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్), రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ(టీఎస్‌టీడీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రకాల పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్, ఇన్‌స్ట్రాగామ్ రీల్స్, ఫొటోగ్రఫీ పోటీలకు ఏర్పాట్లు చేశారు.ఫొటోగ్రఫీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ 20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, షార్ట్ ఫిల్మ్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, ఇన్‌స్ట్రాగామ్‌రీల్స్, ఫొటోగ్రఫీల విజేతలకు రూ,10, రూ.5వేలు, రూ 3వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి కింద అందిస్తారు. ఈ పోటీలలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు కోసం https.nithm.ac.in/registration.php లో చేసుకోవాలి. హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక, అతిథ్యరంగాలకు చెందిన అంశాలకు సంబంధించిన వాటిని పంపాలి. ఒక్కరు ఒక ఎంట్రీని మాత్రమే పంపడానికి అవకాశం ఉంటుంది. డాక్యుమెంటరీ ఫిల్మ్ సమర్పణలు 20 నుంచి 30 నిమిషాల నిడివి ఉండాలి. షార్ట్ ఫిల్మ్ సమర్పణ 10 నుంచి15 నిమిషాల మధ్య ఉండాలి. రీల్స్ 90 సెకన్లకు మించకూడదు. ఫొటోగ్రఫీ ఎంట్రీలను జేపీఈజీ లేదా పీఎన్‌జీ ఫార్మాట్‌లో హై రెజల్యూషన్ ఇమేజ్‌లుగా పంపాలి.తమ సమాచారం, పోటీలకు పంపే ఎంట్రీలను పంపడానికి గడువు తేదీ సెప్టెంబర్ 15వ తేదీ. విజేతలను సెప్టెంబర్ 25వ తేదీ ప్రకటిస్తారు. ఈ పోటీలలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చు.

హస్తకళలు, చేతివృత్తులకు చేయూత



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న భారతప్రభుత్వ ఎంఎస్ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ డి.చంద్రశేఖర్

- ఎంఎస్ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ చంద్రశేఖర్
- హైటెక్స్‌లో పారిశ్రామిక, ఇండెక్స్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం భారతీయ హస్తకళా సాంప్రదాయాలను పునరుద్ధరిస్తుందని, కళాకారులను ప్రోత్సహిస్తుందని భారతప్రభుత్వ ఎంఎస్ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న పారిశ్రామిక, ఇండెక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళాకారులు, చేతివృత్తుల వారికి రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న పీఎం విశ్వకర్మ పథకాన్ని సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. వరంగల్‌లో ఈ పథకాన్ని వివిధ మంత్రులు ప్రారంభిస్తారన్నారు. చేతివృత్తి దారులకు 5 శాతం తక్కువ వడ్డీ రేటుతో రూ.లక్ష వరకు రుణాలను అందజేస్తుందన్నారు. ఇండోర్ ఇన్ఫోలైన్ ఎండీ ఎక్స్‌పో నిర్వాహకుడు రాజ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ఇండెక్స్‌పో పరిశ్రమ నిపుణులు, ఔత్సాహికులు , తయారీ పరిశ్రమలో తాజా పురోగతులపై చర్చిస్తామన్నారు. ఈ ప్రదర్శనలో 100 మంది ఎగ్జిబిటర్లు, హ్యాండ్ టూల్స్, మెషీన్ టూల్స్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, సోలార్ పవర్‌ప్లాంట్స్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, సెఫ్టీ ఉత్పత్తులు ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశం ఉచితమని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

గొర్రెల పంపిణీ

పటాన్‌చెరు: మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి 12 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గొల్ల, కురమ వర్గాల వారు తమ సంప్రదాయ వృత్తులలో సాధికారత సాధించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, మీరాజ్ ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రామకృష్ణ, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త ఔషధాలు అత్యవసరం

పటాన్‌చెరు టౌన్: కొత్త ఔషధాలను మార్కెట్లలోకి తీసుకురావడానికి అధిక ధర, సుదీర్ఘ ప్రక్రియ పెద్ద సవాళ్లని ఇన్నాచూరా సైంటిఫిక్ ప్రవేట్ లిమిటెడ్ సీఈవో వ్యవస్థాపకుడు డాక్టర్ నందన్‌కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'చిన్న మాలిక్యూల్ ఔషధ ఆవిష్కరణ రంగంలోని సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై శుక్రవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. యాంటీబయాటిక్స్, బ్యాక్టీరియాలో పెరుగుతున్న నిరోధకత సవాలును అధిగమించడంతో పాటు ప్రస్తుతం చికిత్స చేయలేని వ్యాధులకు కొత్త ఔషధాలను అభివృద్ధి చేయవలసిన తక్షణ అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 22 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

గ్రాండ్ పేరెంట్స్ డే



మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సమీనా మాట్లాడుతూ మారుతున్న కాలంలో బంధాలు ఏ విధంగా బలహీనపడుతున్నాయనే పరిస్థితులను వివరిస్తూ సంస్కృతి, సాంప్రదాయాలకు వారసులుగా ఉండే పెద్దలను గౌరవించాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అమ్మమ్మలు, తాతయ్యలు చిన్నారులతో సరదాగా గడుపుతూ కథలు, పాటలు, పద్యాలతో అలరించారు.

భవిష్యత్ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే

హెచ్‌సీయూ ప్రొఫెసర్ మీనా హరిహరన్



మాట్లాడుతున్న మీనా హరిహరన్

శేరిలింగంపల్లి: భవిష్యత్ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మీనా హరిహరన్ తెలిపారు. ఫ్రెండ్స్ అసోసియేషన్, జెమ్ మోటార్స్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం టీచర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మీనా మాట్లాడుతూ విశ్వంలో గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులలోని అజ్ఞానాన్ని తొలగించి, జీవిత విలువలు తెలియజేసి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతారన్నారు. నేటి యువత, రాధాకృష్ణనన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, విద్యా విధానంలో వస్తున్న మార్పులను గుర్తించాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని సూచించారు. అంతకు ముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ మీనా హరి హరన్‌ను శాలువాతో సన్మానించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి, జెమ్ మోటార్స్ చైర్మన్ ఇ.రాజుయాదవ్, మాదాపూర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బసవలింగం, అసోసియేషన్ ప్రతినిధులు కొండిన్యశ్రీ, వెంకటేశ్వరరాజు, విష్ణుప్రసాద్, జనార్ధన్, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి.. అవగాహన ర్యాలీ



మాదాపూర్: భారతదేశంలో 35 లక్షల మంది కార్నియల్ బ్లైండ్‌నెస్, అంధత్వంతో బాధపడుతున్నారని డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. మాదాపూర్‌లోని ఫినిక్స్ ఎరినాలో శుక్రవారం నేత్రదానం ముగింపు సందర్భంగా శంకర కంటి ఆసుపత్రి, ఫినిక్స్ ఫౌండేషన్ కలసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 20వేల కొత్త కార్నియా కేసులు నమోదవుతున్నాయని, నేత్రదానం వల్ల ఇద్దరు అంధులకు చూపు వస్తుందన్నారు. భారతదేశంలో రోజుకు 30వేల మంది చనిపోతున్నారని వారి కుటుంబ సభ్యులు తమ ఆత్మీయుల నేత్రాలను దానం చేస్తే కొద్ది నెలల్లోనే ఈ దేశం నుంచి అంధత్వాన్ని పారదోలవచ్చన్నారు. కార్యక్రమంలో శంకర ఐ హాస్పిటల్ యూనిట్ హెడ్ రంజిత్‌కుమార్, ఫినిక్స్ గ్రూప్ డైరెక్టర్ నీలేష్ జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభం



చిత్రాలను తిలకిస్తున్న డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి కళాకారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని ప్రజలు వాటి ప్రత్యేకతలను తెలుసుకోవాలని కోరారు. కళాకారులు వేసిన 175 చిత్రాలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయని ,ఈనెల 10వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

హైలైఫ్ జువెల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి నందిత, నిర్వాహకుడు డొమినిక్ తదితరులు

మాదాపూర్: యువతను ఆకట్టుకునే ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని నటి దీక్షనగర్‌కర్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ జువెల్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. నటీమణులు నందితా శ్వేత, ప్రక్షా అయ్యగారి, ఆశరెడ్డి, కామాక్షి భాస్కర్ పాల్గొన్నారు. నిర్వాహకుడు డొమినిక్ మాట్లాడుతూ టాప్ జువెలరీ బ్రాండ్‌లు, ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

సాంకేతిక పదాలను అనువదించడం అవసరం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న హెచ్‌సీయూ, ఎన్‌టీఎం, సీఐఐఎల్ ప్రతినిధులు

రాయదుర్గం: సాంకేతిక పదాలను భారతీయ భాషలకు అనువదించడం అవసరమని నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్ (ఎన్‌టీఎం) ఇన్‌చార్జీ అధికారి డాక్టర్ తారీఖ్‌ఖాన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో సెంటర్ ఫర్ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ (సీఏఎల్‌టీఎస్), హెచ్‌సీయూ, ఎన్‌టీఎం, సీఐఐఎల్ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషలలో అనువాద సమానమైన వాటి పరిశీలన' అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనువాదం యొక్క స్పష్టత, సమర్థతపై దృష్టి పెట్టాలని, అందుకోసం ఆలోచనాత్మక, శక్తివంతమైన చర్చలను వర్క్‌షాప్‌ల ద్వారా జరపాలని సూచించారు. సీఏఎల్‌టీఎస్ విభాగం అధ్యాపకులు, వర్క్‌షాప్ సమన్వయకర్త డాక్టర్ నరేష్ అన్నెం , ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మియాపూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్ పరిధిలోని 100 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన రూ.1,00,11,116లు ఆర్థిక సహాయం చెక్కులను మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు , మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు,ఏరియా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.